ప్రజా

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 299 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 04 - 06 - 2026




తెలంగాణకు వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

# పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ
- తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు
- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ



**హైదరాబాద్ :**

తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు.సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ - మిగతా 2 లో

## తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు



- జూన్ 5 నుంచి కొత్త రేట్లు!
- భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ
- పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్లు తెలిపిన మంత్రి పొంగులేటి
- వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్లు వెల్లడి

**హైదరాబాద్ :**

తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ - మిగతా 2 లో



## కేసీఆర్ పోరాటం లేకపోతే తెలంగాణ సాకారం అయ్యేది కాదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ కంటే ఏ రాష్ట్రమైన ఎక్కువ సాధించిందని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా
- కేసీఆర్ చచ్చుడో, తెలంగాణ వచ్చుడో అని ధైర్యంగా చెప్పిన ఏకైక నేత
- ప్రతి వ్యక్తి తాను పుట్టినగడ్డ చరిత్ర తెలుసుకోవాలన్న కేటీఆర్

**హైదరాబాద్ :**

తెలంగాణ కథలో నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆనాడు బలవంతంగా తెలంగాణ, ఆంధ్రాను కలిపింది వారేనని, తెలంగాణ - మిగతా 2 లో

## ముంచుకొస్తున్న సూపర్ ఎల్ నినో ముప్పు - యూఎన్ వార్నింగ్

- ఎల్ నినోకు సంబంధించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ఐక్యరాజ్యసమితి
- దశాబ్దాల కాలంలో ఇదే అత్యంత తీవ్రమైనదిగా అంచనా
- పసిఫిక్ మహాసముద్రం అడుగుభాగంలో నీటి ఉష్ణోగ్రతలు ఏకంగా 6 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగాయి



**ఢిల్లీ :**

రానున్న కొన్ని వారాల్లో ప్రపంచ వాతావరణాన్ని సమూలంగా మార్చేయగల 'ఎల్ నినో' ముంచుకొస్తోందని ఐక్యరాజ్యసమితి తీవ్రస్థాయిలో హెచ్చరించింది. ఇప్పటికే - మిగతా 2 లో

# కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం



- ప్రమాణం చేయించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్
- కొలువుదీరిన కొత్త ప్రభుత్వం
- హాజరైన రాహుల్, ఖర్గే
- కేబినెట్లో సిద్దరామయ్య తనయుడికి చోటు
- ప్రమాణానికి ముందు డీకేకు ఫోన్ చేసిన సోనియా గాంధీ
- అందరినీ కలుపుకుని పనిచేస్తానని సోనియాకు హామీ ఇచ్చిన డీకే శివకుమార్
- ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న పరమేశ్వర్!

**బెంగళూరు :**

కర్ణాటకలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ డీకే శివకుమార్‌తో ప్రమాణం చేయించారు. అలాగే సీనియర్ నేత జి.పరమేశ్వర్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఇద్దరితోపాటు మరో 12 మంది మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ - మిగతా 2 లో

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం 21 మంది సజీవ దహనం



- లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఘటన
- పలువురికి తీవ్ర గాయాలు
- 37 మందిని కాపాడిన పోలీసులు
- మంటల్ని అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- చనిపోయిన వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

2 లో




## సరికొత్త సైజుల్లో మద్యం సీసాలు

- 150మి.లీ, 200మి.లీ బాటిళ్లకు ఎక్సైజ్ శాఖ అనుమతి!
- కొత్త సైజుల్లో మద్యం సీసాలకు ఏపీ ప్రభుత్వం అనుమతి
- 150మి.లీ, 200మి.లీ సీసాలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు
- ధరల విషయంలో మార్పులు ఉండబోవన్న అధికారులు

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ తీసుకున్న సరికొత్త నిర్ణయం ఇప్పుడు మద్యం ప్రియుల మధ్య హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో ఇకపై సరికొత్త - మిగతా 2 లో

## ప్రజానాడి





## అభివృద్ధి గురించి ఆలోచించకుండా విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- పొట్టి శ్రీరాములు విగ్రహానికి పవన్‌కల్యాణ్ పుష్పాంజలి
- ఆ మహనీయుని బలిదానం కారణంగా ఏపీకి ఉనికి ఏర్పడింది
- వైఎస్సార్సీపీ వచ్చాక రాజకీయాల్లో కులదూషణలు మరింత పెరిగాయని విమర్శ





**అమరావతి :**

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడేందుకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహానుభావులను కుల చట్రాల్లో బంధించటం బాధాకరమని డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణలో ఇప్పటికీ 'తెలంగాణ' అనే భావోద్వేగం ఉందని మన రాష్ట్రంలో మాత్రం ఇంకా కులం పరిధిలోనే ఉండిపోయామని తన ఆవేదనను వెలిబుచ్చారు.అమరావతిలోని పొట్టి శ్రీరాములు స్మృతివనం సందర్శించి ఆయన విగ్రహానికి పవన్ కల్యాణ్ నివాళులు అర్పించారు. - మిగతా 2 లో

# కోటి మందితో యోగాంధ్ర-2026

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన
- జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



**అమరావతి :**

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో - మిగతా 2 లో

# సంపాదకీయం

## లెక్కల్లో దాగుడుమూతలు

గణాంకాలపై ఎందరెందరో ఫిర్యాదులున్నా, ఎవరెంత వేళాకోళం చేసినా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, అమల్లోవున్న విధానాల దిద్దుబాటుకూ అవే ఆధారం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ మూడు రోజుల క్రితం విడుదల చేసిన జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్) చూస్తే మన దేశం ఏయే రంగాల్లో మెరుగుపడింది, ఇంకెన్ని రంగాల్లో సవరించుకోవాల్సిన అవసరముందని అనే విషయాలు తెలుస్తాయి. 1992--93లో విడుదల చేసిన తొలి సర్వేనుంచీ చూస్తే గణాంకాల విడుదలైన సర్వే ఆరోది. దేశవ్యాప్తంగా 715 జిల్లాల్లో నిర్వహించిన ఈ సర్వే మాతా--శిశు ఆరోగ్యం, బాలల పౌష్టికాహారం, ఆరోగ్య బీమా వగైరాల్లో మన దేశం ముందడుగు వేసిందని చాటుతోంది. ఇది సమగ్రమైనదనీ, అత్యుత్తమ నాణ్యతతో కూడిన గణాంకాలు రాబట్టడానికి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నామనీ ఆ నివేదిక వివరిస్తోంది.2030 నాటికి ప్రపంచ దేశాలన్నీ సాధించి తీరాల్సిన వాటిగా ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు ఎంత చేరువలో ఉన్నాం... ఎంత దూరంలో ఉన్నాం అనేది తెలుసుకోవటం, తగువిధంగా సవరించుకోవటం ఈ గణాంకాల ఉద్దేశం. గత నివేదికతో పోలిస్తే ఆసుపత్రుల్లో శిశుజననాల శాతం పెరిగిందనీ(88.6 శాతం నుంచి 90.6 శాతానికి), ప్రసవానికి ముందు ఆరోగ్య పరిరక్షణ 95.9 శాతానికి చేరుకుందనీ, సంతాన సాఫల్యత రేటు స్థిరంగా 2.0 దగ్గరుందనీ, పౌష్టికాహారలోపం తగ్గిందనీ, ఏడాది--రెండేళ్లమధ్య వయసుండే పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల శాతం 87.1 శాతానికి చేరుకుందని నివేదిక వివరిస్తోంది. అసలు తొలి ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదికకూ, తాజా నివేదికకూ చూస్తే స్పష్టమైన ప్రగతి కనిపిస్తుంది. అప్పట్లో కేవలం 40 శాతం ప్రసవాలు మాత్రమే ఆసుపత్రుల్లో జరిగేవి. అవి ఇప్పుడు 90 శాతానికి పెరగటం చిన్న విషయమేం కాదు.అయితే గణాంకాలు ఏం చెబుతున్నాయన్నది కాదు... ఏం చెప్పటం లేదన్నది ముఖ్యమని నిపుణులంటారు. ఆ కోణంలో ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదిక నిరాశపరుస్తుంది. గత నివేదికకూ, ఇప్పటికీ చూసినా ఎన్నో అంశాల దాటవేత తెలుస్తుంది. గత నివేదికకు మొత్తం 131 సూచీలుంటే ఇప్పుడది 101కి తగ్గాయి. అంటే అనేక అంశాలను ఈ సర్వే పూర్తిగా విస్మరించిందన్నమాట! శిశువులు, పిల్లల మరణాల రేటైనా, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలైనా, హెచ్ఐవిపై అవగాహన కల్పించటమైనా ఇందులో కనబడవు. అవి సర్వే చేయదగ్గ అంశాలు కాదనిపించటంలోని సహేతుకత ఏమిటో కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖకే తెలియాలి. ఒకవేళ వేరే గణాంకాల కోసం విడిగా సర్వే చేసివుంటే ఆ సంగతి చెప్పాలి.2015--16 సంవత్సరంలో విడుదలైన నాలుగో నివేదికలో వంటగ్యాస్ వినియోగం 43.8 శాతం మేర ఉంటే ఆ తరువాతి సర్వే నాటికి అది 58.6 శాతానికి పెరిగిందని వెల్లడైంది. అటు తర్వాత కేంద్రం కోట్ల సంఖ్యలో అదనపు కనెక్షన్లు మంజూరు చేసింది. దాని ప్రభావం ఎలా ఉందో చూద్దామంటే ఇప్పుడది మాయం! స్వచ్ఛ భారత్ అభియాన్ కింద మరుగుదొడ్ల నిర్మాణాల సంఖ్య 10 కోట్లకు చేరుకుందని 2019లో ప్రకటించి, దాన్ని కీలకమైన ఘట్టంగా చెప్పారు. తీరా తాజా నివేదిక ప్రస్తుత స్థితి ఎలా వుందో, అటుతర్వాత మెరుగుపడిందో లేదో చెప్పకుంటే ఎలా? ఇక పిల్లల్లో, మహిళల్లో రక్తహీనత ఎలా వుందన్న ప్రశ్న కూడా ఎగిరిపోయింది. గత సర్వేలో ఈ అంశానికి సంబంధించిన ఏడు సూచీలున్నాయి. అయితే ఈ నివేదికలో నేరుగా నగదు బదిలీ, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక లావాదేవీలు వగైరా అంశాలున్నాయి. మంచిదే. అంత మాత్రాన ఇతర సూచీలు తొలగించటం సరికాదు.మనం చెప్పుకోవటానికైతే జీడీపీపరంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ఆరో స్థానంలో ఉన్నాం. కానీ మౌలికంగా మనది అల్పాదాయ వర్గాలు అధికంగా ఉండే దేశం. సంపద పంపిణీ రీత్యాచూస్తే జనాభాలో కేవలం 10 శాతంమంది దగ్గర దాదాపు 65 శాతం సంపద ఉండగా, వీరిలో కేవలం 1 శాతంమంది చేతుల్లో 40 శాతం సంపద ఉంది.

## కోటి మందితో యోగాంధ్ర-2026

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా yogandhra.ap.gov.in పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## ఏపీలో సరికొత్త సైజుల్లో మద్యం సీసాలు

**మొదటిపేజీ తరువాయి -** పరిమాణాల్లో 150మి.లీ మరియు 200మి.లీ మద్యం సీసాలు కూడా మార్కెట్లోకి అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం కాకుండా, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త సైజుల్లో మద్యం సీసాలను తయారు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ పలు ప్రముఖ లిక్కర్ తయారీ కంపెనీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కంపెనీల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించిన ఎక్సైజ్ శాఖ, పాత నిబంధనలను సవరిస్తూ తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన ఉత్తర్వులలో భాగంగా, కొత్త పరిమాణాల్లో వచ్చే మద్యం బాటిళ్లకు సంబంధించి ఒక కేసులో (బాక్స్) ఖచ్చితంగా ఎన్ని సీసాలు ఉండాలి అనే ప్యాకింగ్ నిబంధనలను కూడా ఎక్సైజ్ శాఖ స్పష్టంగా ఖరారు చేసింది. అయితే, కొత్త సైజుల్లో మద్యం వస్తున్నప్పటికీ ధరల విషయంలో ఎలాంటి అదనపు మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో అమల్లో ఉన్న ధరల విధానమే ఈ కొత్త పరిమాణంలోని సీసాలకు కూడా వర్తించనుంది. కాగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 90మి.లీ, 180మి.లీ, 375మి.లీ, 750మి.లీ మరియు లీటర్ బాటిల్స్ విక్రయాలు సాగుతుండగా.. త్వరలోనే ఈ జాబితాలోకి 150మి.లీ, 200మి.లీ సీసాలు కూడా అధికారికంగా చేరనున్నాయి,

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం, 21 మంది సజీవ దహనం

**మొదటిపేజీ తరువాయి -** ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 40 మందిని కాపాడారు. మాలవీయనగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూటే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

## పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తాం

**మొదటిపేజీ తరువాయి -** కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

## తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు

**మొదటిపేజీ తరువాయి -** మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు. కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు. ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## 'చెత్త పన్ను' రద్దు చేశాం



**మొదటిపేజీ తరువాయి -** పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. గత పాలకులు ప్రజల నుంచి పన్నులు వసూలు చేశారని, కానీ ఊళ్లలో చెత్త కుప్పలను మాత్రం అలాగే వదిలేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. పురపాలక శాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.21 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన ప్రకటన చేశారు. విజయవాడలో మున్సిపల్ అధికారులతో జరిగిన కీలక వర్క్‌షాప్‌లో మంత్రి ఈ విషయాలను వెల్లడించారు. విజయవాడలో మున్సిపల్ ఇంజనీర్లతో ఒక కీలక వర్క్‌షాప్ జరిగింది. పురపాలక, ప్రజారోగ్య శాఖల ఇంజనీర్లు దీనికి హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. చెత్త పన్ను పేరుతో గత ఐదేళ్లుగా ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. పన్నులు వేసినా పారిశుద్ధ్యం ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిచ్చాయన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఆ చెత్త పన్నును పూర్తిగా రద్దు చేసిందని, దీని వల్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ఊరట లభించిందని ఆయన తెలిపారు. మున్సిపాలిటీల్లో జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థల్లో పనుల తీరుపై ఆయన సమీక్షించారు. పారిశుద్ధ్యంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 20వ తేదీన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం ఉందని, ఈలోగా అన్ని పురపాలక సంస్థల్లో పనులు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా చెత్త ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణాలు వేగవంతం కావాలన్నారు. ఎక్కడికక్కడ ఈ ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి రావాలని, ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖలో రూ.21 వేల కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ పనుల్లో నాణ్యత ఉండాలని, పనుల వేగం కూడా చాలా ముఖ్యం అని మంత్రి స్పష్టం చేశారు. పనులు వేగంగా జరగాలంటే సమన్వయం ఎంతో అవసరమన్నారు. అధికారులు, గుత్తేదార్లు కలిసికట్టుగా పని చేయాలని, పరస్పరం అపార్థాలు లేకుండా సమన్వయం చేసుకోవాలన్నారు. ఒక పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, నిర్దేశించిన గడువులోగా పనులను కచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులతో నేరుగా సమావేశం కావడం మంచి పరిణామమని ఆయన అన్నారు. దీనివల్ల కింది స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని చెప్పారు. అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు స్వయంగా తెలుసుకోవచ్చని, వాటిని అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం కూడా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు 'చెత్త నుంచి విద్యుత్ తయారీ' ప్లాంట్లు ఉన్నాయని, ఇవి రెండూ విజయవంతంగా పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. కాకినాడ ప్లాంటు పనులు కూడా ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ఈ కాకినాడ ప్లాంటును అందుబాటులోకి తెస్తామన్నారు."క్షేత్రస్థాయిలో వర్క్ చేయడంలో లోకల్‌గా ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ల్యాండ్ ఇబ్బందులు రావచ్చు. ఏజెన్సీలతో ఏమైనా ప్రాబ్లమ్స్ ఉండొచ్చు. వాటన్నింటినీ డిస్కస్ చేసి, ఆ సమస్యలన్నీ పరిష్కరించేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించాం. దీని ద్వారా అధికారుల నాలెడ్జ్ కూడా బాగా ఇంప్రూవ్ అవుతుంది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం 'అమృత్ 1.0' పనులను మధ్యలోనే ఆపేసింది. ఆ తర్వాత 'అమృత్ 2.0' కింద కేంద్రం నుంచి రూ.8,500 కోట్లు వచ్చాయి. ఆ పనులను కూడా ఆపేశారు. వచ్చిన ఆ డబ్బులన్నింటినీ ప్రభుత్వ ఖజానా నుంచి పక్కదారి పట్టించారు. అలాగే, 'స్వచ్ఛ భారత్' పథకం కింద రూ.3 వేల కోట్లు వస్తే, వాటిని కూడా వాడుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ నిధుల్లో మెజారిటీ భాగాన్ని పనుల కోసం ఉపయోగించామన్న పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ.

## అభివృద్ధి గురించి ఆలోచించకుండా విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

**మొదటిపేజీ తరువాయి -** ఈ సందర్భంగా తమ పార్టీ తరపున కులాలకు అతీతంగా మాట్లాడేందుకు సేనాగళం పేరుతో కమిటి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏ కులం వారిని అదే కులం వారితో విమర్శించే విధానం పోవాలని వివరించారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి కులం వెనక దాక్కునే సంస్కృతి వద్దని పవన్ అన్నారు. ఇకపై ఏ అంశాన్నయినా పార్టీ విధానంగానే మా నాయకులు ఎదుర్కొంటారని తెలిపారు. నిరుద్యోగం, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కులాల కుంపట్లు పెరిగాయని, ఈ వాతావరణానికి చెక్ పెట్టాలని జనసేన పార్టీ భావిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణా భూమి పుత్రుల జాగీరు కాదని ఎవరూ అనరని, కానీ అందులోకి రానివ్వమని చెప్పటం పైనే తాను అభ్యంతరం తెలిపానన్నారు. గద్దర్ వంటి వారు ఎప్పుడూ ఇలా ఎవరినీ రావొద్దని మాట్లాడలేదని గుర్తు చేశారు. ఆంధ్రా నాయకులు ఎవరూ వెళ్లి తెలంగాణాలో పోటీ చేయటం లేదని, తెలంగాణా భూమిపుత్రులు పోటీ చేస్తామంటే ఏంటి అభ్యంతరం అని ప్రశ్నించారు. ఇటీవలి పరిణామాల వెనక కుట్ర ఉందని చెప్పలేనని, విద్వేషాలకు ముగింపు పలకాలని భావిస్తున్నట్లు పవన్ చెప్పారు. కులదూషణలకు స్వస్తి చెప్పాలని సేనాగళం పేరుతో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. కులం గురించి ఎవరు మాట్లాడినా ఈ కమిటీ పెద్దలే మాట్లాడతారన్నారు. కొందరు నేతలు ఇష్టం వచ్చినట్లు తిట్టి కులం ముసుగులోకి వెళ్తున్నారన్నారు. నిన్నటి వ్యాఖ్యల్లో ముందస్తు వ్యూహం ఏమీ లేదన్నారు. నన్ను 20 ఏళ్లుగా తిడుతున్నారు, వాటిని పట్టించుకోనన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దారి తీసిందన్నారు. మహానాయకులను కులచట్రాల్లో బిగించడం రాజకీయాల్లో అలవాటుగా మారిందన్నారు. పొట్టి శ్రీరాములు బలిదానం కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు ఉనికి ఏర్పడిందని గుర్తు చేశారు. 2005 తర్వాత కులదూషణలను సున్నిత అంశాలుగా మార్చారన్నారు. వైఎస్సార్సీపీ వచ్చాక రాజకీయాల్లో కులదూషణలు మరింత పెరిగాయని గుర్తు చేశారు. ఎవరైనా తప్పు చేస్తే ఆ వ్యక్తిని నిందించాలి తప్ప అతడి కులాన్ని కాదని పవన్ హితవు పలికారు. కొన్నిచోట్ల కులసంఘాల నాయకులు లాభపడుతున్నారన్నారు. అన్ని కులాలు సహకరిస్తేనే నాయకులు అవుతారన్నారు. అభివృద్ధి గురించి ఆలోచించకుండా విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులదూషణలకు చరమగీతం పాడాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. గద్దర్ కుటుంబసభ్యులు అంటే తనకు చాలా ఇష్టమని పవన్ కల్యాణ్ అన్నారు. పాలసీలపై కేటీఆర్ మాట్లాడి ఉండవచ్చు, ఆయన నాకు మిత్రుడని పవన్ వివరించారు. విభజన రాజకీయాలకు స్వస్తి పలకాలి, ఎవరికీ మంచిది కాదన్నారు. కేటీఆర్, నేను అనేక విషయాలు మాట్లాడు కుంటాం, విభేదాలు ఏమీ లేవని పవన్ తేల్చిచెప్పారు. ఈ 12 ఏళ్లలో అనేకమంది ఏపీ కాంట్రాక్టర్లు తెలంగాణలో పని చేశారని పవన్ తెలిపారు. ఈ 12 ఏళ్లలో అనేకమంది తెలంగాణ కాంట్రాక్టర్లు ఏపీలో పని చేశారని గుర్తు చేశారు. నా సభకు అనుమతి ఇవ్వడం చిన్న విషయం, అనుమతిస్తే గొడవే వచ్చేది కాదన్నారు. హైదరాబాద్‌లో నాకు ఇల్లు ఉంది, అక్కడ ఉండటం సాధారణ మన్నారు. సభ పెట్టుకోవడం అనేది నా హక్కు, దాన్ని కాదనకూడదని హితవు పలికారు. రాష్ట్ర విభజనకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రగల్చడం రాహుల్‌గాంధీకి మంచిది కాద న్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడాలన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ఏం నేర్చుకున్నారన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారు ప్రజలకు ఏం సందేశం ఇస్తారని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ, తమిళనాడులో ప్రాంతీయ భావం ఉందన్నారు. ఏపీ ప్రజల్లో ఉన్న ఉప ప్రాంతీ యవాదం సరికాదన్నారు. వైఎస్సార్సీపీకి భయపడితే ఇంతమంది రాజకీయాల్లోకి ఎందుకు వస్తారన్నారు. ఇప్పుడు వారికి 3 జిల్లాలతో కలిసిన రాజధాని కావాలంటే సాధ్యమేనా అంటూ పవన్ ఎద్దేవా చేశారు. అందరూ కలిసి నిర్ణయం తీసుకున్నాక ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాజధానిపై వైఎస్సార్సీపీ నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు.




## ముంచుకొస్తున్న సూపర్ ఎల్ నినో ముప్పు - యూఎన్ వార్నింగ్

**మొదటిపేజీ తరువాయి -** గ్లోబల్ వార్మింగ్ కారణంగా వేడెక్కిన భూమండలంపై, ఈ ఎల్ నినో ప్రభావం మరింత వినాశకరంగా ఉండనుందని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దశాబ్దాల కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఈసారి సూపర్ ఎల్ నినో ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. దీని వల్ల భారత్‌పై ఎలాంటి ప్రభావం పడనుంది ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి విపత్కర మార్పులు జరగనున్నాయో ఈ కథనంలో చూద్దాం. ఈ ఏడాది మిగిలిన కాలంలో ఎల్ నినో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ స్పష్టం చేసింది. దీని ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన వాతావరణ మార్పులు సంభవిస్తాయని పేర్కొంది. సాధారణంగా పసిఫిక్ మహాసముద్రంలో వేడిగాలుల కారణంగా ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడాన్నే ఎల్ నినో అంటారు. శాస్త్రవేత్తల తాజా అంచనాల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రం అడుగుభాగంలో నీటి ఉష్ణోగ్రతలు ఏకంగా 6 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగాయి. ఆ మహాసముద్రంలో భారీ ఉష్ణ తరంగాలు తూర్పు వైపుగా వేగంగా కదులుతున్నాయి. రానున్న రోజుల్లో అతిపెద్ద వాతావరణ ముప్పును ఎదుర్కోబోతున్నామని కచ్చితంగా చెప్పగలమని, ఇది బహుశా రికార్డు స్థాయి ఎల్ నినో కావచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులతో ఇప్పటికే మండిపోతున్న ప్రపంచంపై, ఈ ఎల్ నినో ఆజ్యం పోస్తుందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ హెచ్చరించారు. దీని ప్రభావాలు సరిహద్దులు దాటి మరీ వేగంగా వ్యాపిస్తాయని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా తీవ్రమైన ఎల్ నినో ఏర్పడినప్పుడు, ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన పరిస్థితులు తలెత్తుతాయి. దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాలోని చాలా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు, కార్చిచ్చులు వస్తాయి. అదే సమయంలో అమెరికాలోని దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వరదలు ముంచెత్తుతాయి. ముఖ్యంగా భారత్ విషయానికొస్తే, ఎల్ నినో కారణంగా రుతుపవనాలు తీవ్రంగా బలహీనపడతాయి. దీనివల్ల వర్షపాతం తగ్గిపోతుంది. ఈ పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగం కుదేలై పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఆహార ధరలు ఆకాశాన్ని తాకుతాయి. సప్లై చైన్ దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థలకు లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మనిషి సృష్టిస్తున్న వాతావరణ మార్పులకు, ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడే ఈ ఎల్ నినో కలిస్తే ఎలాంటి విపత్తులు వస్తాయోనని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు. ఈ ఎల్ నినో దెబ్బకి వచ్చే 2027 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. కొద్దిరోజుల క్రితమే, భూమిపై అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినో ఈ ఏడాదిలో ఏర్పడవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇది జూన్ నుంచి ప్రారంభం కావొచ్చని అంచనా వేశారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు మారిపోతాయని, ఉష్ణోగ్రతలు భారీగా పెరగొచ్చని, రుతుపవనాలు అసాధారణంగా ఉండొచ్చని భావించారు. మరోవైపు, మే నెలలో ఎల్‌నినో ఏర్పడుతుందని, ఆగస్టు నాటికి బలపడుతుందని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) అంచనా వేసింది. ఆగస్టులో సూపర్ ఎల్‌నినో ఏర్పడే అవకాశం 22 శాతం ఉందని, స్ట్రాంగ్ ఎల్‌నినో ఏర్పడటానికి 80శాతం, ఒక మోస్తరు ఎల్‌నినో ఏర్పడేందుకు 98శాతం అవకాశాలున్నాయని అభిప్రాయపడింది.

## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు డీకే వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఆ తర్వాత తాజా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డీకే సత్కరించారు. అనంతరం తన తాతయ్య గంగాధరయ్య చిత్రపటానికి నివాళులర్పించి ఆయన్ను స్మరించుకుంటూ కర్ణాటక రాష్ట్రానికి 34వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో డీకే చేతిలో రాజ్యాంగం బుక్ అందర్నీ ఆకర్షించింది. చేతిలో రాజ్యాంగం బుక్‌ను పట్టుకుని ఆయన ప్రమాణం చేశారు. కాగా, డీకే కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటు దక్కింది. వీళ్లతోపాటుగా కె.హెచ్.మునియప్ప, కె.జె.జార్జ్, ఎం.బి.పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరెగౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ థావర్‌చంద్ ప్రమాణం చేయించారు. దీంతో కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలో నయా సర్కార్ కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీకే శివకుమార్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ డీకే శివకుమార్‌కు అభినందనలు. ప్రజల సంక్షేమం కోసం కేంద్రం కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది' అని మోదీ పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుండగా, ఎం.బి. పాటిల్ బసవన్న సిద్ధేశ్వర మహాస్వామి పేర్ల మీద ప్రమాణం చేశారు. దీంతో కార్యదర్శి శాలిని రజనీశ్ జోక్యం చేసుకుని, పత్రంలో ఉన్న పదాలను మాత్రమే చదవాలని సూచించారు. ప్రమాణ పత్రంలో ఉన్నవి తప్ప మరే ఇతర విషయాలను చదవకూడదని గవర్నర్ ఆదేశించారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఆయన సొంత నియోజకవర్గం రామనగరలో అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని ఐజూరు సర్కిల్, చన్నపట్న వద్ద బస్ స్టాండ్ వద్ద వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.



## కేసీఆర్ పోరాటం లేకపోతే తెలంగాణ సాకారం అయ్యేది కాదు

**మొదటిపేజీ తరువాయి -** ఉద్యమాలను కర్కశంగా అణచివేసింది హస్తం పార్టీనేనని ధ్వజమెత్తారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమే తెలంగాణ ఇచ్చినప్పటికీ ఇవ్వక తప్పని పరిస్థితి సృష్టించిన నాయకుడు కేసీఆరేనని స్పష్టం చేశారు. తమకు కూడా కేసీఆర్ లాంటి పాలకుడు కావాలని పొరుగు రాష్ట్రాలవారు అనుకునేలా పదేళ్ల పాలన కొనసాగించామన్నారు. దశాబ్దకాలంలో సుసంపన్నమైన తెలంగాణను ఆవిష్కరించామన్న కేటీఆర్, రాష్ట్రాన్ని పరిపాలించే నాయకత్వ పటిమ మీకుందా అని ఆనాడు కేసీఆర్‌పై కొందరు మాటల దాడి చేశారన్నారు. దేశానికి అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని, వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఎన్నికల అజెండాలో లేకున్నా తాము రైతుకు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు పథకం తెచ్చినట్లు గుర్తుచేశారు. తలసరి ఆదాయంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపామన్న ఆయన, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని మంజూరు చేసినట్లు తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత పెట్టుబడుల సాధనలో బెంగళూరును అధిగమించినట్లు చెప్పారు. "మేం తెలంగాణలో బాధ్యత తీసుకున్ననాడు అపోహలు ఉండేవి. కొత్త పరిశ్రమలు ఏమోగానీ ఉన్న పరిశ్రమలు పోతయోమో అని అనేవారు. ఐటీ జాబ్స్ 3 లక్షలు ఉండేవి. మా హయాంలో పది లక్షలకు తీసుకుని పోయాం. అత్యంత వేగంగా అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించాం. బెంగళూరును మూడు సార్లు తలదన్నాం. ఇది భారతదేశంలో ఎవరు సాధించలేదు. పెద్ద పెద్ద మల్టీనేషనల్ కంపెనీలకు చిరునామ్మగా హైదరబాద్‌ను చేశాం. గూగుల్, మెటా, అమెజాన్, యాపిల్, ఊబర్ ఇలాంటివెన్నో తీసుకొచ్చామన్న కేటీఆర్. ప్రతి వ్యక్తి తాను పుట్టినగడ్డ చరిత్ర తెలుసుకోవాలని కేటీఆర్ తెలిపారు. పరిపాలనలో దేశానికే, తెలంగాణ కొన్ని పాఠాలు నేర్పిందని, తాము తీసుకొచ్చిన పథకాలను కేంద్రం, మరికొన్ని రాష్ట్రాలు కాపీ కొట్టాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కంటే ఏదైనా రాష్ట్రం ఇంకా ఎక్కువ సాధించిందని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు. గతంలో ఆంధ్ర, తెలంగాణను కలిపేసిన తర్వాత కొన్నాళ్లకే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలైందన్నారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను కాంగ్రెస్ బలిగొన్నదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కాంగ్రెస్ కర్కశంగా అణిచివేసిందని ఆరోపించారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలికొందని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నవి కాకి లెక్కలని కేటీఆర్ విమర్శించారు. ఏడాది కాలంలో రూ.29 వేల కోట్లు మాత్రమే అప్పులు తీర్చారని, నెలకు రూ.6 వేల కోట్లు అప్పు తీరుస్తున్నామనేది అబద్ధమన్నారు. నెలకు రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని తెలిపారు. తాము పదేళ్లలో రూ.2.80 లక్షల కోట్లు మాత్రమే అప్పులు చేసినట్లు వెల్లడించారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్లు నిర్మించినట్లు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు రెండున్నరేళ్లలోనే రూ.4.50 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఆ డబ్బంతా ఎక్కడికి పోయిందని కేటీఆర్ ప్రశ్నించారు. భూముల వేలం ద్వారా వేల కోట్లు వస్తున్నాయన్న ఆయన ఆ నగదును ఏం చేస్తున్నారు అని అడిగారు. తెలంగాణకు మళ్లీ ముప్పు పొంచి ఉందని, మోటార్లకు మీటర్లు పెడితేనే నిధులు ఇస్తామని మోదీ అన్నారని ఆరోపించారు. నిధులు రాకపోయినా సరే రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని తాము అధికారంలో ఉన్నప్పుడు చెప్పామని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాత్రం మోదీ చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరి రైతుల మోటార్లకు మీటర్లు పెడుతున్నారన్నారు. తెలంగాణలో అవసరం లేకపోయినా రైతు డిస్కమ్ ఏర్పాటు చేశారని ఆక్షేపించారు. అసలు ఫ్యూచర్ సిటీ అనడమే తప్పు అని, అది ఫ్యూచర్ సిటీ కాదు ఫార్మా పరిశ్రమల కోసం సేకరించిన భూమి అని కేటీఆర్ గుర్తుచేశారు. భూసేకరణ చట్టం ప్రకారం భూములు దేనికి సేకరించారో దానికే వినియోగించాలని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి జర్నలిస్టులకు భూమి ఇవ్వాలంటే బద్వేల్‌లో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై చిత్తశుద్ధి ఉంటే మంచిరేవుల, పేట్‌బషీరాబాద్‌లో ఇవ్వాలని అన్నారు.

# గోదావరి పుష్కరాలకు రూ. 100 కోట్ల నిధులు

**ప్రజా ప్రభుత్వం ఏడాది ముందే పనులు ప్రారంభం..**

**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్..**





**గొల్లపల్లి జూన్ 03 ప్రజా మంటలు అంకం భూమయ్య :** 2027 లో నిర్వహించి గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు తొలి విడత విడుదల చేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం వెల్గటూర్ మండలంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.వెల్గటూర్ నుండి రాజక్క పల్లె వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు. అదే విధంగా వెల్గటూర్ లో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా బోటింగ్ సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు. కోటిలింగాల నుండి పాసిగాం వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ధర్మపురి పట్టణంలో మంగళ్ ఘాట్ నుండి బ్రాహ్మణ సంఘం, పోచమ్మ గుడి మీదుగా దమ్మన్నపేట రోడ్డుకు కలిసే విధంగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో ఆగమేఘాల మీద పనులు ప్రారంభించి నాణ్యతకు త్రిలోధకాలు ఇచ్చారని మంత్రి అన్నారు. పుష్కరాల సమయంలో పనులు నడవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తుల ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు.ప్రస్తుతం ఏడాది ముందే పనులు ప్రారంభించి 2027 మార్చి వరకు పుష్కరాల పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటు న్నామని మంత్రి తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ధర్మపురి నియోజకవర్గానికి పుష్కరాల సందర్భంగా నిధులు తీసుకువస్తానని ఇచ్చిన మాట పుష్కరాలకు ప్రత్యేక నిధులు తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# అర్హుల ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**సికింద్రాబాద్,జూన్ 03 ( ప్రజామంటలు) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) పేరిట అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించి మన ఓటు బ్యాంకును పదిలపరుచుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) పిలుపునిచ్చారు. బుధవారం సీతాఫలమండీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం జరిగింది. బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల రామేశ్వర గౌడ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో ఓట్లను తొలగించాలని చూస్తోందని, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఉండి అర్హుల ఓట్లను కాపాడాలని దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గం మొదటి నుంచి తెలంగాణ వాదానికి కంచుకోటగా నిలిచిందని, ఇక్కడి ఓటర్లను తాము ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేస్తూనే ఉన్నామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా అప్రజాస్వామ్య పద్ధతులను పాటిస్తూ పాలిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రలను పార్టీ శ్రేణులన్నీ కలిసికట్టుగా అడ్డుకోవాలని కోరారు. సమావేశ అధ్యక్షత వహించిన యువ నేత రామేశ్వర గౌడ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంతా ఐక్యమత్యంగా వ్యవహరించి ఓటర్ల జాబితా సవరణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను కూడా విజయవంతం చేయాలని సూచించారు.ఈ నియోజకవర్గ ప్రతినిధుల సభలో ముషీరాబాద్ శాసనసభ్యులు మూటా గోపాల్, కంటోన్మెంట్ ఇంచార్జ్ క్రిశాంక్, మాజీ ఎమ్మెల్సీ సలీం, బీఆర్ఎస్ యువ నేతలు తీగుళ్ళ కిశోర్ కుమార్, త్రినేత్ర గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్, పార్టీ నేత జైసింహ పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లింగాల ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, సమన్వయకర్త రాజా సుందర్, ఎన్నికల ఇంచార్జ్ డీ. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు అవసరమైన నిధులు సమకూర్చుతాం

**ఎక్కడ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోండి**

**పుష్కరాల సమీక్ష సమావేశంలో మంత్రి అడ్లూరి**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి - చుక్క గంగారెడ్డి- (ప్రజా మంటలు ) జూన్ 03 :** 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు అవసరమైన నిధులు తీసుకువస్తానని భక్తులకు ఎక్కడ అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు రోడ్లు భవనాల శాఖ అధికారులు, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం బడ్జెట్ల లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు కేటాయించిన పుష్కరాల నిధుల్లో జగిత్యాల జిల్లా రూ. 117 .08 కోట్లు కేటాయించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. మొదటి విడుదల కేటాయించిన నిధుల్లో ధర్మపురిలో అభివృద్ధి పనులకు రూ. 83.07 కోట్లు కోటిలింగాలకు రూ. 34. 01 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు.ధర్మపురికి ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 22.02 కోట్లు, రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ. 25.08 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 25.07 కోట్లు, దేవాదాయ శాఖ ద్వారా రూ.10 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాలకు నీటి పారుదల శాఖ ద్వారా రూ 16.01 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ. 8 కోట్లు దేవాదాయ శాఖ ద్వారా రూ. 10 కోట్లు టైర్ వన్ లో విడుదలైనట్లు మంత్రి వివరించారు.ఇందుకు సంబంధించిన టెండర్లు త్వరలోనే పూర్తి అవుతాయని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టాల్సిన పనులను అంచనాలు వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎందుకు సంబంధించిన నిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# బౌద్ధనగర్‌లో భారీ షార్ట్ సర్క్యూట్: ఆటో దగ్ధం



**సికింద్రాబాద్,జూన్ 03 ( ప్రజామంటలు) :** బౌద్ధనగర్ డివిజన్ ఎల్ ఎన్ నగర్‌లో బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం జరిగింది. విద్యుత్ స్తంభానికి చుట్టుకుపోయిన వందలాది ఇంటర్నెట్, టీవీ కేబుల్ వైర్ల వల్ల భారీ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ప్రమాదంలో వైర్లు పూర్తిగా కాలిపోవడమే కాకుండా, పక్కనే ఆపి ఉంచిన ఆంజనేయులు అనే వ్యక్తికి చెందిన కొత్త ఆటో సైతం నిలువునా బూడిదైంది.గత 15 రోజుల క్రితమే ఆటో ను కొనుగోలు చేసినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది సకాలంలో స్పందించి కనెక్షన్లు నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, అర్ధరాత్రి వేళ జరిగిన ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.వీధుల్లో కేబుల్ వైర్లు ఇష్టారాజ్యంగా వేలాడుతుండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, కనీసం ఫైర్ ఇంజన్, అంబులెన్స్ కూడా రాలేని విధంగా రహదారులు అడ్డుగా మారాయని స్థానికులు మండిపడుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ కరెంటు స్తంభాలపై వేలాది కేబుల్ వైర్లు ప్రమాదకరంగా గుట్టలుగా పడి ఉన్నాయని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ప్రెసిడెంట్ మహ్మద్ మస్తాన్ బాబా అధికారులకు విజ్ఞప్తి చేశారు.


# సనత్ నగర్ బీఆర్ఎస్ లో ఆధిపత్య పోరు





**సికింద్రాబాద్, జూన్ 03 (ప్రజా మంటలు) :** సనత్ నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీనపడిందని, అవినీతి కార్యకలాపాలు, నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో ఆ పార్టీలో అంతర్యుద్ధం నడుస్తోందని బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గంలో అసలు విషయం తెలిసి కూడా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ మునుపటి కంటే ఎంతో పుంజుకుందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలోనూ బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఇటీవల బేగంపేట్ డివిజన్ బీజేపీ మహిళా నాయకురాలు సంధ్య లక్ష్మి తల్లి సరోజ మరణించిన విషయం తెలుసుకున్న మర్రి పురురవ రెడ్డి, బుధవారం మధ్యాహ్నం స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి బేగంపేట్‌లోని వారి నివాసానికి వెళ్లారు. అక్కడ సరోజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం, శోకతప్త హృదయంతో ఉన్న సంధ్య లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ మీకు అన్ని వేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారికి భరోసా కల్పించారు.ఈ పరామర్శ అనంతరం అక్కడకు వచ్చిన పత్రికా విలేఖరులతో పురురవ రెడ్డి మాట్లాడుతూ.. సనత్‌నగర్ గులాబీ పార్టీలో అంతర్గత విభేధాలు భగ్గుమంటున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లోనూ ఆ పార్టీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, అవినీతి కారణంగా ప్రజల్లో వారు నమ్మకం కోల్పోయారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు ఇ. దయానంద్, జి. అశోక్ కుమార్, సి. విజయ్ కుమార్, నక్క శ్రీనివాస్ గౌడ్, ఆకుల మహేష్, క్రాంతి కుమార్, మహేష్ కుమార్ ముదిరాజ్, టి. వెంకటేశ్ యాదవ్, ఎం. నగేష్, ఎన్. మహేష్, చంద్రశేఖర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**జగిత్యాల జిల్లా ప్రతినిధి - చుక్క గంగారెడ్డి - (ప్రజా మంటలు) జూన్ 03 :** ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి మార్కులు సాధించిన జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు.బొల్లి మనస్వి, రాయిళ్ల కృతిక, సింగారపు ప్రసన్నలు, పాఠశాల యాజమాన్యం గాంధీనగర్ నాయకులతో కలిసి బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత, ముఖ్యంగా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

## పాలకేంద్రం 24 వ వార్షిక మహాసభ

**అత్యధికంగా పాలు సరఫరా చేసిన పాడి రైతులకు బహుమతుల ప్రదానం**



**భీమదేవరపల్లి జూన్ 3( ప్రజా మంటలు) :** భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామంలోని పాలకేంద్రం 24 వ, వార్షిక మహాసభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభలో సంఘ కార్యదర్శి హరిత గత ఏడాదికి సంబంధించిన వార్షిక నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పాలకేంద్రానికి అత్యధికంగా పాలు పోసి అభివృద్ధికి సహకరించిన పాడి రైతులకు బహుమతులు అందజేశారు.గేదె పాలు ఎక్కువగా సరఫరా చేసిన ఏనుగు జమున ప్రథమ బహుమతి అందజేశారు. ఆవు పాలు ఎక్కువగా సరఫరా చేసిన పార్నందుల ప్రమీల గారికి ప్రత్యేక బహుమతి ప్రదానం చేశారు. పాలకేంద్రం అధ్యక్షురాలు ఏనుగు సరిత, కేంద్రం పాలకవర్గ సభ్యులు, రూట్ సూపర్ వైజర్ వనిత చేతుల మీదుగా ఈ బహుమతులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ మహాసభలో భాగంగా విచ్చేసిన సభ్యులందరికీ ముల్కనూరు మహిళా డెయిరీ ప్రొడక్ట్ యూనియన్ బిస్కెట్లను పంపిణీ చేశారు.

## బాసర ఐఐఐటీ లో జగిత్యాలకు 126 సీట్లు

**డీఈవో కు సత్కారం**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి - చుక్క గంగారెడ్డి - ( ప్రజా మంటలు ) జూన్ 03 :** ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జగిత్యాల జిల్లా నుండి 126 మంది బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రామును పిఆర్టియు టిఎస్ నాయకులు జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్ రావు, యాళ్ళ అమర్నాథ్ రెడ్డిలు సన్మానించారు.తెలంగాణ రాష్ట్రంలోనే జగిత్యాల్ జిల్లాను రెండో స్థానంలో నిలిపినందుకు జిల్లా విద్యాధికారి కె.రామును అభినందించారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతన డీఆర్వో కె.వై. ప్రసాద్



**జగిత్యాల, జూన్ 3(ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా డీఆర్వో (జిల్లా రెవెన్యూ అధికారి)గా ఇటీవల నియమితులైన కె.వై. ప్రసాద్ బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిపాలన, రెవెన్యూ శాఖ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారాలపై పారదర్శకంగా, భాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా అభివృద్ధి, ప్రజలకు సమర్థవంతమైన సేవలందించడంలో రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.జిల్లా పరిపాలన లక్ష్యాల సాధనకు పూర్తి స్థాయిలో సహకరిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని డీఆర్వో కె.వై. ప్రసాద్ తెలిపారు.

## మహిళలు నైపుణ్యాలను అంది పుచ్చుకోవాలి

**సెర్ప్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి. సునీత**



**జగిత్యాల జూన్ 3(ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రం లోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో మహిళలకు ఎంబ్రాడయిరి శిక్షణ తరగతులకు వారు హాజరై శిక్షణ యొక్క అవశ్యకత ను, సెర్ప్ ద్వారా అందించే సదుపాయాల గూర్చి, వ్యక్తిత్వ వికాసం పై మాట్లాడుతు సెర్ప్ ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు ఆయా రంగాలలో శిక్షణ తరగతులు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్. సెటి లో నిపుణుల ద్వారా ఉచిత శిక్షణ తరగతులు ఇవ్వడం జరుగుతుందని, తదుపరి వారికీ కావల్సిన ఋణం బ్యాంక్ ల ద్వారా అందించి యూనిట్లను నెలకొలపే విదంగా ప్రోత్సాహించడం జరుగుతుందని అన్నారు.వారితో జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్. రమేష్, డైరెక్టర్ యం. బాపు, జిల్లా ఆపియం, శిక్షణ కేంద్రం డైరెక్టర్ ఎపియం వి. గంగాధర్, శిక్షకులు,సిబ్బంది, ఆయా మండలాల నుండి శిక్షణకు హాజరైయ్యే సభ్యులు తదితరులు హాజరయ్యారు.

## ఓల్డ్ బోయిన్‌పల్లి మార్కెట్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం



**సికింద్రాబాద్,జూన్ 03 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లిలోని అంబేద్కర్ రిటైల్ వెజిటేబుల్ మార్కెట్‌లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు మార్కెట్ పరిసరాల్లో నిరంతర నిఘాకు, ప్రజల రక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ, అధ్యక్షుడు మక్కాల అశోక్, ఉపాధ్యక్షుడు నరసింహారావు, తిరుమలగిరి సీఐ రామన్నయ్య, ఎస్సై మారుతితో పాటు మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాజేశం గౌడ్‌ను పరామర్శించిన పలువురు మిత్రులు



**హైదరాబాద్, జూన్ 03 (ప్రజా మంటలు) :** ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శివరాం, డాక్టర్ హర్ష, డీఎస్ఆర్ సింగ్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# నిప్పుల కొలిమిలా మారుతున్న హైదరాబాద్

**వేడికి కేంద్రాలుగా మారిన ఏడు ప్రాంతాలు**

**చెట్లు నరికిన తర్వాత నుంచి పెరిగిన ఉష్ణోగ్రతలు**

**రానున్న రోజుల్లో వడగాలుల ప్రభావం అధికం**

**ఎండ తీవ్రత నుంచి తప్పించుకోవాలంటే ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలంటున్న నిపుణులు**



గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాలలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవడాన్ని 'అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్' అంటారు. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, చెట్ల సంఖ్య తగ్గిపోయి నీడ, సహజమైన శీతలీకరణ సదుపాయాల లభ్యతలో పరిమితుల ఏర్పడుతున్నాయి. దీంతో అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్‌ను పెరుగుతోందని ఫ్రాంటియర్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ జర్నల్ పేర్కొంది. హైదరాబాద్ నగరం రోజురోజుకు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతోంది. నిర్మాణాలు, రహదారులు కోసం సిమెంట్‌ను ఎక్కువగా వాడుతున్నారు. దీనికితోడు అవసరమున్నా, లేకున్నా చెట్లని నరుకుతున్నారు. ఫలితంగా పచ్చదనం తగ్గి రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగటిపూట వేడిని తట్టుకునే సామర్థ్యం తగ్గుతుందని ఫ్రాంటియర్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ జర్నల్ తెలిపింది. రానున్న రోజుల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా కానుందని, దీనివల్ల ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోక తప్పదని ఆ జర్నల్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు, వడగాలులు, మరణాల అధ్యయనంలో పది నగరాలను ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ కూడా ఉంది. భాగ్యనగరాన్ని ఆధారంగా తీసుకుని పలు జిల్లాలో హీట్‌వేవ్ కారణంగా మరణాలను అంచనా వేసినట్టు పరిశోధకులు అధ్యయనంలో పేర్కొన్నారు. భానుడు ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు రోజంతా తిప్పినా ఉపశమనం లభించడం లేదు. చెట్లను విచ్చలవిడిగా నరికివేయడమే ఈ పరిస్థితికి కారణమని పర్యావరణ శాస్త్రవేత్తలు, ట్రీప్రొటెక్షన్ కమిటీ చెబుతోంది. ఈ విషయాన్ని హైదరాబాద్ అర్బన్ ల్యాబ్ సైతం ధ్రువీకరించింది. హైదరాబాద్ నగరంలోని ఏడు ప్రాంతాల్లో భూపరితల ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్నాయి. ఇవి అర్బన్ హీట్ ఐలాండ్స్‌గా పేర్కొంది. భూ ఉపగ్రహ గూగుల్ ఎర్త్‌లోని ఉష్ణోగ్రతలను విశ్లేషించగా బీఎన్‌రెడ్డినగర్, పటాన్‌చెరు, మన్సురాబాద్, మైలార్‌దేవ్‌పల్లి, బండ్లగూడ, గచ్చిబౌలి, హయత్‌నగర్ ప్రాంతాలు వేడిమికి కేంద్రంగా ఉన్నాయి. అహ్మదాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, పుణె, ముంబాయి, వారణాసి, శిమ్లా నగరాల్లో పరిశీలన చేశారు. చిన్న చిన్న కారణాలతో చెట్లని నరికివేయడం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కొన్ని కొన్ని కాలనీల్లో చెట్లను నరికివేయకముందు ఉష్ణోగ్రత 32 డిగ్రీలు, నేలపై 34 డిగ్రీలు నమోదయ్యేవి. కానీ చెట్లు విచ్చలవిడిగా నరికిన తర్వాత గాలిలో 40 డిగ్రీలు, నేలపై 46 డిగ్రీలుగా వేడి ఉంది. ఈ ఎండ తీవ్రతను తగ్గించాలంటే వీలైనన్ని మొక్కలు నాటాలి. ట్రాన్స్‌లొకేషన్ ద్వారా మొక్కలు నాటాలి. చెట్ల నరికివేతపై అర్బన్ ఫారెస్ట్రీ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల నిఘా కూడా చాలా అవసరం. జపాన్ లాంటి దేశాల్లో చెట్లను నరికివేస్తే భారీ జరిమానాలు విధిస్తారు. అందువల్ల అక్కడ ప్రజలు మొక్కలు, చెట్లు పూర్తిగా పెరిగే వరకు వాటి జోలికి వెళ్లరు. అలాంటి పద్ధతులను ఇక్కడ కూడా అమలు చేయాలి.

**ఈ ఎండ తీవ్రత నుంచి బయటపడాలంటే ఇవి పాటించాల్సిందే :**

శీతలపానీయాలకు దూరంగా ఉండాలి. మంచినీటిని తాగాలి.

కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, మజ్జిగ, గ్లూకోజ్ నీరు వంటివి తాగడం మేలు.

కారం, మసాలాలకు దూరంగా ఉండాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

చిన్నపిల్లలను చల్లని ప్రదేశాల్లో ఉంచేలా జాగ్రత్తపడాలి.

సాయంత్రంవేళలో మాత్రమే బయటకు రావడానికి ప్రయత్నించండి.

కాటన్ దుస్తులను ధరించాలి.

ఎండలో పనిచేసేవారు ఎక్కువగా నీరు తాగాలి. దీనివల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. నీడలో ఉండడానికి ప్రయత్నించాలి.

అత్యవసర పరిస్థితులలో ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు, క్యాప్ వాడాలి. తినే ఆహారంలో ఎక్కువగా గ్యాప్ తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌ల మధ్య ఎక్కువ సమయం ఉండవద్దని చెబుతున్నారు.

# వేలేరుపాడులో ఘోర అగ్ని ప్రమాదం

**ఇద్దరు మహిళలు సజీవదహనం**

**అర్ధరాత్రి దాటాక సంభవించిన అగ్నిప్రమాదం**

**నిద్రలోనే ప్రాణాలు కోల్పోయిన మహిళలు**



ఏలూరు జిల్లా వేలేరుపాడులో సోమవారం అర్ధరాత్రి దాటాక సంభవించిన అగ్నిప్రమాదంలో ఇద్దరు మహిళలు సజీవదహనమయ్యారు. గాఢ నిద్రలో ఉండగా ఇంటికి అగ్ని కీలలు అంటుకోవడంతో ఇంట్లోనే ఉన్న మహిళలు మృత్యువాత పడ్డారు. వేలేరుపాడు గ్రామానికి చెందిన వలగాని సావిత్రి (60) నివసిస్తున్న ఇంటికి సుమారు రాత్రి రెండు గంటల ప్రాంతంలో నిప్పంటుకోగా పక్కనే ఉన్న మరో ఇల్లు కూడా కాలిపోయింది. ఈ ఘటనలో సావిత్రితో పాటు తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కాచర్లపాడుకు చెందిన సావిత్రి వదిన పూలమ్మ (65) సైతం అగ్నికి ఆహుతయ్యారు. ఘటనా స్థలానికి కుక్కునూరు సీఐ రమేశ్ బాబు చేరుకుని సంబంధిత వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పు అంటుకుని మృతి చెందారా లేకపోతే వేరే ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీంలు సైతం సంబంధిత వివరాలు సేకరించింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బాలరాజు పరామర్శించి అన్నివిధాలా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ ఘటనపై విచారణ చేయాలని ఎంపీ మహేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మహిళల మృతిపై కుటుంబ సభ్యుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సావిత్రి ఉంటున్న ఇల్లు రేకులతో ఉండగా, చుట్టూ గోడలకు బదులు వెదురు తడికలు కట్టారు. చుట్టూ ఉన్న వెదురు తడికలకు మంటలు అంత తీవ్ర స్థాయిలో అంటుకోవడం, మంటలు చెలరేగే సమయంలో వీరు ప్రతిఘటించే ప్రయత్నం కూడా చేయకపోవడంపై మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేర్వేరు మంచాలపై నిద్రిస్తున్న సావిత్రి, పూలమ్మ కూడా కదలకుండా అలాగే ఉండిపోయి మృతి చెందడంపై కూడా పలు సందేహాలు వస్తున్నాయి. సావిత్రి గొలుసు దుకాణాన్ని నడుపుతున్న నేపథ్యంలో ప్రమాదవశాత్తు జరిగిందా లేక మరే కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు మరింత ఎక్కువవుతున్నాయి.

# దక్షిణ మధ్య రైల్వేకు బ్యాక్‌బోన్‌గా తెలంగాణ

**అతిపెద్ద డివిజన్‌గా సికింద్రాబాద్**

**జోన్ నెట్‌వర్క్‌లో 55 శాతంపైగా ఇక్కడే**

**ఆ తర్వాత మహారాష్ట్ర , పాక్షికంగా కర్ణాటక, ఏపీ, ఎంపీ**

**జూన్ 1 నుంచి అమల్లోకి పునర్విభజన**

**కొత్త సరిహద్దులతో ప్రారంభమైన కార్యకలాపాలు**

భారతీయ రైల్వే వ్యవస్థలో అత్యంత కీలకమైన దక్షిణ మధ్య రైల్వే (గాశీబ్ప్ర జవత్తీఝశ్రీ =ఖఅశ్రీఝఎ) జోన్ ఒక సరికొత్త రూపును సంతరించుకుంది. భౌగోళిక పునర్విభజన ప్రక్రియ పూర్తి కావడంతో, సరికొత్త సరిహద్దులు, నూతన వ్యూహాత్మక మార్పులతో ఈ జోన్ తన అధికారిక కార్యకలాపాలను జూన్ 1వ తేదీ నుంచి విజయవంతంగా ప్రారంభించింది. పునర్విభజన తర్వాత కొత్త సరిహద్దు ప్రాంతాలతో దక్షిణ మధ్య రైల్వే జోన్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఎస్‌సీఆర్ జోన్ పరిధిలో మొత్తం ఐదు రాష్ట్రాలు ఉండగా, రైల్వేట్రాక్ విస్తీర్ణం పరంగా తెలంగాణ, మహారాష్ట్ర తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత కర్ణాటక ఉండగా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని పాక్షిక ప్రాంతం జూన్ 1వ తేదీ నుంచి సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వచ్చి చేరాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్ మే నెలాఖరు వరకు 6,638 ట్రాక్ కిలోమీటర్లతో నడిచింది. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పడటంతో గుంటూరు, విజయవాడ, గుంతకల్ డివిజన్లు అందులోకి వెళ్లిపోయాయి. అయితే పలు టెక్నికల్ సమస్యలతో గుంటూరు, గుంతకల్ డివిజన్లలో కొంత రైల్వే నెట్‌వర్క్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లో కలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లో కొంత భాగం విజయవాడ డివిజన్‌లో కలిపారు. ఫలితంగా విభజన తర్వాత దక్షిణ మధ్య రైల్వే(సికింద్రాబాద్ కేంద్రం) 3,605.220 రూట్ కిలో మీటర్లలతో సోమవారం నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. జోన్ పరిధిలో సెక్షన్లను ఎ,బి,సి,డిలు అనే నాలుగు గ్రూపులుగా విభజించారు.

**గ్రూప్-ఎ :** కాజీపేట-మోటుమర్రి, బల్లార్ష-కాజీపేట, కాజీపేట దగ్గరలోని బైపాస్ ఇలా మూడు సెక్షన్లు ఇందులో ఉన్నాయి. మొత్తం రూట్ కిలో మీటర్లు 391.300, రన్నింగ్ కిలో మీటర్లు 1,130.695గా ఉంది.

**గ్రూప్-బి :** సికింద్రాబాద్-వాడి, పగిడిపల్లి-విష్ణుపురం, కాజీపేట-సికింద్రాబాద్, సికింద్రాబాద్-ఫలక్‌నుమా-డోన్, సికింద్రాబాద్-బొల్లారం-ముద్కేడ్ సహా ఎనిమిది సెక్షన్లను ఇందులో పెట్టారు. మొత్తం రూట్ కిలో మీటర్లు 1,465.060, రన్నింగ్ కిలో మీటర్లు 2,175.013గా ఉంది.

**గ్రూప్-సి :** కాజీపేట-హసన్‌పర్తి బైపాస్ లైన్‌ను ఇందులో చేర్చారు.

**గ్రూప్-డి :** వికారాబాద్-పర్లి, పెద్దపల్లి-కరీంనగర్, భద్రాచలంరోడ్-మణుగూరు, మనోహరాబాద్-సిద్దిపేట సహా 35 సెక్షన్లను గ్రూప్-డీలో చేర్చారు. మొత్తం ట్రాక్ రూట్ కిలో మీటర్లు 1,681.950 కాగా రన్నింగ్ కిలో మీటర్లు 1,717.519గా నిర్ణయించారు. దక్షిణ కోస్తా జోన్ (గాశీబ్ప్ర జశ్ఘీర్ =ఖఅశ్రీఝఎ) పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసేందుకు రైల్వే బోర్డు జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పోస్టుల్లో మే నెలలో సంబంధిత అధికారులను నియమించింది. దక్షిణ కోస్తా జోన్‌కు 128 గెజిటెడ్, 1,100 నాన్‌గెజిటెడ్ అధికారుల పోస్టులను రైల్వేబోర్డు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వే జోన్(సికింద్రాబాద్) నుంచి కొత్త జోన్(విశాఖపట్నం)కు పోస్టులు భారీగా బదిలీ అయ్యాయి. 35 గెజిటెడ్, 980 నాన్‌గెజిటెడ్ పోస్టులను రైల్వే బోర్డు ట్రాన్స్‌ఫర్ చేసింది. మిగతా పోస్టులు సమీపంలోని ఇతర జోన్ల నుంచి బదిలీ చేసే ప్రక్రియను కర్షీడా చేపట్టింది. కాగా దక్షిణ కోస్తా జోన్‌లో 30 మంది గెజిటెడ్, 300 పైచిలుకు నాన్‌గెజిటెడ్ అధికారులు విధుల్లో చేరినట్లు రైల్వేవర్గాల అధికారికంగా తెలిపాయి.

**సౌత్ కోస్ట్ జోన్ :** గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో పాటు కొత్తగా వాల్తేరు డివిజన్ స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన విశాఖపట్నం డివిజన్‌తో కలిపి మొత్తం నాలుగు డివిజన్లతో కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను ప్రారంభించింది.

# పెద్ద పులి బీభత్సం.. వణుకుతున్న పోలవరం జిల్లా వాసులు

**దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామంలో పెద్ద పులి బీభత్సం**

**14 దూడలను పొట్టనబెట్టుకున్న పెద్ద పులి**

**పులిని పట్టుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించిన అటవీ శాఖ అధికారులు**



పోలవరం జిల్లాలోని దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామంలో పెద్ద పులి తీవ్ర కలకలం రేపింది. గ్రామ శివారులో ఉన్న పశువుల మందపై రాత్రి వేళ ఒక్కసారిగా దాడి చేసిన పులి.. ఏకంగా 14 దూడలను పొట్టనబెట్టుకుంది. ఈ ఉదయం పశువుల కాపరులు, యజమానులు వెళ్లేసరికి దూడల మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మృతదేహాలను చూసి వారంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పులి సంచారంతో గంగంపాలెం, చుట్టుపక్కల గ్రామస్తులు ప్రస్తుతం తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ఘోర ఉదంతంపై సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్ద పులిని పట్టుకునేందుకు అడిషనల్ పీసీసీఎఫ్ నాగేశ్వరరావు, కాకినాడ డీఎఫ్‌వో రామచంద్రరావుల ప్రత్యక్ష పర్యవేక్షణలో 'రాపిడ్ రెస్క్యూ టీమ్' ఒక ప్రత్యేక ఆపరేషన్‌ను ప్రారంభించింది. పులి అడుగుజాడలను గుర్తిస్తూ, దాన్ని సురక్షితంగా బంధించేందుకు బోన్లు, కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పులి సంచారం ఇంకా కొనసాగుతున్నందున అటవీ ప్రాంత సరిహద్దుల్లోని ప్రజలు, రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని అధికారులు సూచించారు.

# వీరాభిమానం.. నటుడు విజయ్ విగ్రహానికి పూజలు

**తమిళనాడులో నటుడు విజయ్‌కు విగ్రహం పెట్టి పూజలు చేస్తున్న అభిమాని**

**ఇంట్లోని పూజగదిలో విగ్రహాన్ని ప్రతిష్టించిన టీవీకే పార్టీ కార్యకర్త**

**రోజూ హారతి ఇస్తూ చేస్తున్న పూజల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌ం**

**అభిమాని చర్యపై తీవ్రంగా మండిపడుతున్న నెటిజన్లు**



తమిళనాట సినీ తారలను దైవ సమానులుగా కొలిచే సంస్కృతి మరోసారి చర్చనీయాంశంగా మారింది. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ మీద ఉన్న అభిమానంతో ఓ పార్టీ కార్యకర్త ఏకంగా తన ఇంట్లోని పూజగదిలోనే ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన సుకుమార్ షణ్ముగం అనే వ్యక్తి, విజయ్ స్థాపించిన టీవీకే పార్టీలో కార్యకర్తగా ఉన్నారు. ఆయన తన అభిమాన నటుడు, నేత అయిన విజయ్‌పై ఉన్న ప్రేమను వినూత్న రీతిలో చాటుకున్నారు. తన ఇంట్లోని పూజగదిలో ఇతర దేవతామూర్తులతో పాటు విజయ్ నిలువెత్తు బొమ్మను (విగ్రహాన్ని) ప్రతిష్టించారు. అంతటితో ఆగకుండా ప్రతిరోజూ ఆ విగ్రహానికి హారతి ఇస్తూ, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ తతంగాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, అది క్షణాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సినిమాల్లో నటించినంత మాత్రాన, రాజకీయాల్లోకి వచ్చినంత మాత్రాన వ్యక్తులను దేవుళ్లతో సమానంగా చూడటం సరికాదని అభిప్రాయపడుతున్నారు. "అభిమానం ఉండొచ్చు కానీ, ఈ స్థాయిలో వెర్రి అభిమానం సమాజానికి చేటు చేస్తుంది" అని కామెంట్లు పెడుతున్నారు. అభిమానానికి కూడా ఒక హద్దు ఉంటుందని, ఇలాంటి చర్యల ద్వారా సమాజానికి తప్పుడు సందేశం పంపవద్దని హితవు పలుకుతున్నారు. అయితే, తమిళనాడులో సినీ తారలకు గుళ్లు కట్టడం, వారిని దేవుళ్లుగా ఆరాధించడం కొత్తేమీ కాదు. గతంలో నటీమణులు ఖుష్బూ, నమితలకు వారి అభిమానులు ఏకంగా ఆలయాలు నిర్మించారు. అలాగే, దివంగత ముఖ్యమంత్రి, నటుడు ఎంజీఆర్‌కు, సూపర్ స్టార్ రజనీకాంత్‌కు కూడా వారి అభిమానులు గుళ్లు కట్టి తమ ఆరాధనను చాటుకున్నారు. ఇప్పుడు ఈ జాబితాలో విజయ్ కూడా చేరగా, ఈ సంస్కృతిపై మరోసారి విస్తృతమైన చర్చ జరుగుతోంది.

# శ్రీ సత్యసాయి జిల్లాలో విషాదం



**అప్పుల భారంతో పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య**

**చికిత్స పొందుతూ తల్లి, కుమారుడు మృతి**

**అనంతపురం ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమార్తె**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

శ్రీ సత్య సాయి జిల్లా, హిందూపురం మండలం ఎం. బీరేపల్లి గ్రామంలో అప్పుల బాధతో ఓ కుటుంబం ఛిన్నాభిన్నమైన విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక మహాలక్ష్మి (40) అనే మహిళ తన ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి, అనంతరం తాను కూడా విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో తల్లి మహాలక్ష్మితో పాటు ఆమె కుమారుడు రిషి (10) మృతి చెందగా, కుమార్తె శ్రీనిధి (12) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కూల్‌డ్రింక్‌లో విషం కలిపి : కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సమాచారం ప్రకారం మహాలక్ష్మి కూల్‌డ్రింక్‌లో విష గుళికలు కలిపి రిషి, శ్రీనిధికి తాగించింది. అనంతరం ఆమె కూడా అదే విషాన్ని తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురిని గమనించిన స్థానికులు వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మహాలక్ష్మి, రిషి మృతి చెందారు. శ్రీనిధిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మహాలక్ష్మి, ఆమె భర్త ముద్దప్ప చిన్నపాటి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కుటుంబ అవసరాలు, వ్యాపార నిర్వహణ కోసం ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, ఇతర వ్యక్తుల వద్ద అప్పులు చేసినట్లు సమాచారం. వ్యాపారంలో ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం, అప్పులు రోజురోజుకు పెరుగుతుండటంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. మృతురాలి భర్త ముద్దప్ప మాట్లాడుతూ, తమ దాంపత్య జీవితంలో ఎలాంటి కలహాలు లేవని, అప్పుల ఒత్తిడే ఈ దారుణానికి కారణమై ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి తల్లి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో తల్లి, కుమారుడు మృతి చెందడం ఎం. బీరేపల్లి గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది. కుటుంబాన్ని ఆదుకోవాల్సిన తల్లి, తన పిల్లలతో కలిసి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చిన్నారి శ్రీనిధి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆమె భవిష్యత్తుపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, మృతుల కుటుంబానికి స్థానికులు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడి కుటుంబాల మానసిక స్థితిపై ఎంతటి ప్రభావం చూపుతాయో మరోసారి గుర్తుచేసింది. సహాయం కోరే అవకాశాలు లేక, సమస్యలకు పరిష్కారం కనిపించకపోతే సాధారణ కుటుంబాలు కూడా ఎంతటి తీవ్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు ఏర్పడతాయో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా అమాయక చిన్నారులు ఇటువంటి పరిస్థితుల్లో బలవడం సమాజాన్ని ఆలోచింపజేసే అంశంగా మారింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com